# దక్షిణ నాయకుడు

మా స్నేహితుడు చంద్రం పెళ్లికి వెళ్లి వస్తూ దోవలో ఉన్న మావయ్య గారి ఊరు వెళ్లాను. నేను చేరేసరికి మధ్యాహ్నం రెండుగంటలయింది. ఎండ కూడా రవంత తీవ్రంగానే వుందేమో ఊరంతా పగటి నిద్దురలో ఒక్క కునుకు తీస్తూంది. మావయ్యవాళ్లు బాగా కలిగినవాళ్ళు, ఆయన డబ్బంటే మనకోసం పుట్టింది కాని, డబ్బుకోసం మనం పుట్టామా అనే రకం మనిషి. మా తాతయ్య ఆ జిల్లా కంతా మోతుబరి అయినా, తన జీవితమంతా నేలకు బెత్తెడున్న పాత ఇంటిలోనే గడిపాడు. కాని మావయ్య ఊహలు వేరు. తాతయ్య అంటే బీదవాడుగా పుట్టి, కష్టపడి గొప్పవాడయ్యాడు. మరి మావయ్యో! ఆయన యీ గడ్డమీద పడేసరికే తాతగారికి సిరి అందుకుంది. అందుకనే పెద్ద వయస్సులో పుట్టిన యీ బిడ్డకు, లక్ష్మీప్రసాదు అని పేరు పెట్టాడు. మావయ్య తరహా అంతా వేరు. ఆయన చూపులు, ఆలోచనలు ఎప్పుడు అందరికంటే ఎన్నో అంతస్థులు దాటి ఉండేవి.

తనకు నలభై సంవత్సరాల వయస్సులో మైనారిటీ వాళ్ళగానే, అంటే, ఎనభై సంవత్సరాల వయస్సున, తాతయ్య అవతారం చాలించి "హరీ!" అని అనగానే, ఇంతకాలం కనబడకుండా తనని కట్టేసి వుంచిన శృంఖలాలను అన్నింటిని ఒక్కుమ్మడి మావయ్య తెగనరికి తాతపేరు తరతరాల నిలిపి తనకూ, తన వాడకూ శాశ్వతమయిన భవంతి- ఎవరికీ ఆ పరగణాలో లేనటువంటిది అంటే అదే పూర్వం రాజులు, మహరాజులు రాజకుమార్తెల మీద కోపం వచ్చినప్పుడు ఊరి పొలిమేరలకు నాలుగు కోసుల దూరంలో నట్టడవిలో చీమలు దూరని చిట్టడవిలో కట్టించిన ఒంటిస్థంభం మేడ కాకపోయినా అదే ఫక్కీలో ఒకటికి పది స్థంభాలు పెట్టి అందానికి అందం, బలానికి బలం ఉండేటట్టు మొజాయిక్ ఫ్లోరింగ్, నకిలీ పాలరాతి గచ్చులతో "సుందర్ విలాస్" భవనాన్ని నిర్మించగానే అందమైన భవనం కనుక అలా పేరు పెట్టాడని మేమంతా సంబరపడితే, గృహప్రవేశానికి రెండు రోజులు ఉందనగా ఇంటికి "సుందర్ విలాస్" అని పేరు పెడుతున్నానని మావయ్య అమ్మమ్మతో అనేసరికి ఆవిడ "ఏళ్ళు మీదపడ్డా వాడి బుద్దులు పోలేదు" అని సణుక్కుంటున్నట్టు విసుగ్గా అనేసరికి మేమంతా అర్థంకాక ఏమా పాడుబుద్దులు! ఏమా కథ? అని అడిగే సాహసం లేక, పోనీ సాహసం చేసి అడిగినా ఆ మూడుకాళ్ళ ముదుసలి సరైన సమాధానం చెబుతుందని నమ్మకం లేక, ఒకటికి రెండుసార్లు

తటపటాయించినా అసలు సంగతి తెలుసుకుందామనే కుతూహలం మాకు సన్నగిల్లక చిట్టచివరకు, ఎట్టకేలకు ధైర్యం చిక్కబట్టుకుని వెన్నెల వె(ర్రిగా కాసేవేళ మావయ్యనే కదిపి చూసేసరికి ఆయన కాలుస్తున్న చుట్ట చేతబట్టి చుక్కలవంక చూపులు సాచి,

"దాని దుంపతెగ! అది శూద్రమనిషై పోయిందిగాని లేకపోతేనా..."

"లేకపోతే?"

"ఐనా ఎందుకులే కుర్రకుంకవి నీకు యీ విషయాలు."

"కుర్రకుంకను కానులే మావయ్యా."

"కుర్రకుంకవు కావా? ఐతే నేను అడిగే చిన్న ప్రశ్నకు సమాధానం చెప్పు.'

"సిద్ధమే."

"ఏళ్ళు ఎన్నిరా అల్లుడా నీకు?"

"పద్దెనిమిది."

"నీ మగసిరి తెలిసిన సుందరులెందరురా?"

"అదేం ప్రశ్న మావయ్యా?"

"ఎందుకని?"

"అటువంటి విషయాలు ఇతరులతో ఎలా చెప్పడం?"

"నేనూ అదే మాట అంటే?"

"నీ విషయం వేరు. నేను ఎవరితోనూ చెప్పనుగా."

"చెబితే నాకు భయం అనుకున్నావా? ఐనా తెలుసుకుందామని మనసు పడుతున్నావు గనుక చెబుతానులే. కూతవేటు దూరంలో ఎక్కడా కాంతలు లేరుగా?"

"లేరు."

"పదునాల్గు జన్మలూ నా నీడ వదలనని మొండిపట్టు పట్టిన ఆ చిన్నది...'

"అత్తయ్య గుడికి వెళ్లింది. పొద్దుపోతే గాని రాదు."

"తొందరపడితే ఎలాగురా అబ్బీ? ఇటువంటి విషయాలలో ఎంత ఓర్పు ఉంటే అంత లాభం."

"ఐతే నేనిక మాట్లాడనులే."

"అంటే రాయిలాగా కూర్చోమనికాదు. అనువైన చోట వూ కొడుతూ వుండు."

"ఊఁ"

"మొదలుపెట్టావూ! అయితే చెబుతాను విను. అనగా అనగా అలనాడు లక్ష్మీప్రసాదు అని ఒక మంచి అందమైన కుర్రవాడు ఉండేవాడు. అమ్మకూ, నాన్నకూ ఒక్కడే మగబిడ్డ. ఇహనేం! లోటులేని గారాబం. వాడికి ఉన్న పని అల్లా దోవన పోయే పడుచుపిల్లలని కవ్వించడం, సరసంగానేలే, కవ్వించడం, వాళ్ళచేత బిగ్గరగానో, నెమ్మదిగానో తిట్లు తినడం, లేకపోతే పిల్లది రవ్వంత చిటపట కోపంతో అంటున్నట్టుగా చనువుగా 'ఏమిటా పాడుపనులు ఎవరైనా చూస్తే' అని అంటే చిరునవ్వుతోనే ఇంకా చనువుతీసుకోవటం, ఇటువంటి చర్యలతో ఏళ్ళు ఏనాటి కానాడు ఎక్కువ అవుతున్నా బుద్ధులు మాత్రం అలాగే నిలిచి ఒక్కొక్కప్పుడు పెచ్చుమీరి మరీ పేట్రేగి పోతుండేవి. యవ్వనంలో అడుగుపెట్టిన అయిదారు వసంతాలకే ఈ చిన్నవాడు చవిగొన్న ఆనందం ఎంతో చెప్పాలంటే చిత్రగుప్తుడికో, విచిత్రగుప్తుడికో లెక్క. 'కాలం అంతా ఒక్కరీతిగా నడవదు. అన్ని రోజులూ మనవి కాదు' అని ఈ పసికాయకు తెలియపరిచే రోజు ఒకటి ఈ జీవి జన్మలో సాక్షాత్కరించింది."

"ఏ రూపంలో?"

"సుందాం" అనే సుందరి రూపంలో. బహుశా అది చరిత్రలో నిలిచిపోగల వ్యక్తి అవుతుందని దాని తల్లితండ్రులు కలగన్నారు కాబోలు. తాటిచెట్లలాగా నల్లగా మనుష్యులుండే కులంలో పుట్టిన ఈ చిన్నదానికి 'సుందరి' అని పేరు పెట్టారు. ఆ పేరు వాళ్ళకే ఎబ్బెట్టుగా తోచి ఆ పేరుతో పిలవలేక చివరికి 'సుందాం' అని పిలిచేవారు. అది పెరిగి పెద్దదై దేవతలకీ, రాక్షసులకీ అమృతం పంచిపెట్టడానికి వచ్చిన మోహినీ రూపంతో యవ్వనంలో అడుగుపెట్టింది. ఆనాడే ఆ వాడకల్లా ఎన్నికైన చిన్నవాళ్ల గుండెల్లో తీరని వ్యధ కలిగించింది. చిత్తిణీ జాతి స్త్రీలాగా కనబడే ఈ చిన్నదాని మదిలో సీతా సావిత్రిల కంటే శీలం ఉందనీ ఆ మారయ్యా రోగులకేం తెలుసు? తెలిసిందల్లా 'సుందరి' నిజంగా సుందరి అనీ, ఆ చిన్నదాని సుందరవదనంలో తొణికిసలాడే చిరునవ్వులు ఈ చిన్నవాళ్ళకోసం కాదనీ. అదృష్టంలో అందరికన్నా పదిఆకులు ఎక్కువ చదివిన ఈ లక్ష్మీప్రసాదు ఇంటికి 'సుందాం' అనే సుందరి ఒకనాడు 'అమ్మగారూ' అని పిలుస్తూ అడుగు పెట్టేసరికి, 'ఎవరే అది?' అంటూ అమ్మ బయటకి వచ్చింది.

"నేనమ్మా లక్ష్మాయి కూతురిని."

"మీ అమ్మ రాలేదేం?"

"ఒంట్లో బద్ధకంగా ఉందట. నన్ను వెళ్లమంది."

"ఏం మళ్లీ నీళ్లు పోసుకుందా?"

"ఆ! పొద్దున్న పోసుకుందమ్మా."

"నీ బొందలే. పోయి అంట్లు తోము" అంటూ ఆవిడ లోపలికి వెళ్లింది.

ఆ చిన్నది కూడా ఆలవోకగా ఒక్కసారి చిరునవ్వుగా ఒడలు విరుచుకొని, బావి దగ్గరకు వెళ్లి అంట్లు తోమడం మొదలు పెట్టింది. నేను కూడా ఏదో పని వున్నవాడిలాగా, అమ్మకంట పడకుండా దొడ్లోకి వెళ్లి జామిచెట్టుని అనుకొని నిలబడ్డాను. నల్లని రూపైతేనేం, ఆ చిన్నదాని వంపులసొంపులు చూస్తూవుంటే ఎక్కడో అంతఃపురాలలో వుండవలసిన యీ అప్సరసను, అంట్లు తోమమని నిర్ణయించిన బ్రహ్మయ్యను తలుచుకొని, కసిదీరా ఒకటికి పదిసార్లు మనస్సున శాపాలు కురిపిస్తూ వుంటే ఆలోచన ఒకటి ఫెళ్లున చెంపపెట్టు లాగా వచ్చి, బ్రహ్మయ్యకు చేతులెత్తి మ్రొక్కుకునేటట్టు చేసింది. అంతఃపురంలో వుండే యీ కన్నె మన కంట పడేదెల్లా? మన మక్కువని మన్నించడమెల్లా? అందుకనేరా వెర్రినాయనా, యీ చిన్నది యీ అవతారంలో రూపు నిలిపింది. మన యింట కాలుబెట్టింది."

ఇల్లా ఎన్ని ఘడియలు, విఘడియలు గడిచాయో తెలియదు. ఇంట్లోంచి అమ్మ, "అబ్బాయి!" అని కేకపెట్టగానే ఉలిక్కిపడి ఉన్న ఉనికి, స్థితి లిప్తకాలం మరిచి, "ఒస్తున్నా" అని ఊంకె పెట్టాను. వెంటనే నాలిక కరుచుకుని, కుక్కిన పేను లాగా నిలబడ్డాను.

అంట్లు తోమే అంగన యీ రంకెకు అడిలి వెనుతిరిగి చూసేసరికి జామిచెట్టు చాటున కనబడ్డది నేను.

"అమ్మో! మీరా? భయం వేసింది" అని అంది. మాట కలిపే అవకాశం అదే.

"నేను భయం వేసేటట్టు వున్నానా?"

"లేరులెండి. అధాట్టుగా చూసేసరికి భయం వేసింది."

"మరి ఎట్లా వున్నాను?"

"నాకు తెలియదు."

చిన్నదాని దృష్టి పనిమీదకు మళ్లింది. నా చూపు మాత్రం వెనుతిరగలేదు. మనస్సు మరలలేదు. చొరవగా ఒక అడుగు ముందుకు వేసి కన్నార్పకుండా ఆ కన్నెను చూడటం మొదలుపెట్టాను.

"నాకేసి ఎందుకు అట్టా చూస్తారు?"

"నీ అందం చూసి మురిసి."

"ఏంటీ..."

"నువ్వు చాలా బాగుంటావు."

చిన్నదాని ముఖంలో చిరునవ్వు వచ్చింది. వెంటనే కోపం కూడా వచ్చింది.

"అట్టాంటి మాటలంటే అమ్మగారితో చెప్తా."

"ఏమని?"

"చినబాబు కొంటెమాటలంటున్నాడని."

"చెప్పు."

'అమ్మగారూ' అంటూ ఆ చిన్నది కేక పెట్టేసరికి నేను బాణంలాగా దూసుకు వచ్చి సావిట్లో పడ్డాను. తోమిన గిన్నెలు వసారాలో పెట్టి "సంజకాడ అమ్మను పంపుతా" అని ఆ చిన్నది అక్కడనుంచి వెళ్లిపోయేసరికి ఒక్కసారి 'అమ్మయ్య' అని అనుకున్నాను. పైకి ఎంత బింకంగా ఉన్నా అది అమ్మతో ఎక్కడ చెప్పి పోతుందోనని మనస్సు గిలగిలలాడుతూనే వుంది. చెప్పలేదు కాబట్టి బతికిపోయాం. చెబితేనా! అమ్మ తలవాచేటట్లు చివాట్లు పెట్టి తలంటి స్నానం చేయించేది. సరే! ఇహ యీ వార్త వంటయింటి గుమ్మం దాటి ముందు సావిట్లోకి వచ్చిందంటే అమ్మబాబోయ్! నాన్న మళ్ళీ సచేల స్నానం చేయించి లక్ష గాయత్రీ చేయించేవాడు. ఇది ఒక్కనాటితో అయితే ఫరవాలేదు. తలపుకు వచ్చినప్పుడల్లా యీ తంతు అంతా మొదటినుంచీ మళ్లీ జరుగవలసిందే. తరువాత మనం హమేషా పంక్తి బాహ్యులమే. ఐతేనేం ఇటువంటి విషయాలలో నాకు ఒక గట్టి నమ్మకం ఉంది. ఈ వయస్సుకత్తెలు మనల్ని ఎంత బెదిరించినా పెద్దవాళ్లతో మాత్రం సర్వ సాధారణంగా ఫిర్యాదు చెయ్యరు. ఒకవేళ చేద్దామనుకున్నా నేరారోపణ ఏ విషయంలో, ఏ మాటలతో చెయ్యాలో తెలియక లోపల్లోపల సణుక్కుని ఊరుకుంటారు.

చిన్నది యింటికి వెళ్లిపోయింది. అమ్మ వంట ప్రయత్నంలో ఉండి పోయింది. మనం బుద్ధిమంతులం లాగా సావిట్లో కూర్చుని వావిళ్ళవారిదేదో ఉద్గ్రంథం చదువుకున్నాం. పనిమీద యింతవరకూ ఊళ్లోకి వెళ్లిన నాన్న యింటికి వచ్చాడు. ఎండన పడి వచ్చాడేమో మొదట్లో నేను ఆయన దృష్టికి ఆనలేదు. తరువాత నేను కంటపడగానే,

"ఏం చేస్తున్నావ్?" అని అడిగాడు.

"చదువుకుంటున్నాను" అని అన్నాను.

ఆయన నమ్మకంలేని కంఠంతో "ఏం చదువుతున్నావ్?" అని ప్రశ్నించాడు.

"దేవీభాగవతం" అని నిర్భయంగా జవాబు చెప్పాను.

ఈమాట వినడమేమిటి, ఆయన ఒక్కక్షణం కూడా అక్కడ నిలబడలేదు. అంత వయస్సులోనూ మెరుపులాగా ఇంట్లోకి దూసుకుని సరాసరివెళ్లి, ఆ ఏడుకొండలవాడి ఎదుట నిలబడి, వినబడీ వినబడనట్టు ఆ చల్లనయ్యను ఒకటే పొగుడుతున్నాడు.

'ఎందుకో' అని అనుకున్నాను. ఆయన ఏదైనా ఘనకార్యం నెరవేర్చుకుని వచ్చాడేమో! అందుకని అంజలి ఘటించి ఈ తన్మయముద్ర పొందుతున్నాడో లేక ఆ తిరుమలయ్య కోరిన రూపంలో ఈయనకు సాక్షాత్కరించాడేమో నని అపోహపడ్డాను.

వారం గడిచిన తరువాత అసలు విషయం అమ్మ చెప్పింది. 'ఈ రాలుగాయి పెడత్రోవ వదలి మామూలు రస్తా మీదికి వచ్చినట్టు కనపడ్డాడట. ఈ నమ్రత, వినయ విధేయత, విద్యయందు ఆసక్తి ఇవన్నీ ఆయనకు పరవశం కలిగించాయట. అందుకనే కోటి మెట్ల వాడికి వెయ్యికోట్ల నమస్కారాలు అని' అసలు విషయం ఆ అమాయక బ్రాహ్మడికేం తెలుసు, ఇది బ్లడ్‌ప్రెషర్ తగ్గటం కోసం మనం పుచ్చుకున్న మందని?

వారం గడిచినా చిన్నది ఆ ఛాయలకు రాలేదు. చిన్నదాని తల్లిమాత్రం ఒక్కక్షణమైనా ఆలస్యం కాకుండా ఉదయం, సాయంత్రం తప్పక హాజరవుతోంది. అది పనిలోకి రాగానే అమ్మ మళ్లీ అడిగింది.

"ఏమే మళ్లీ ఏమన్నా విశేషమా?" అని.

అది అంత వయస్సులోనూ సిగ్గును అభినయిస్తూ, మళ్ళీ పదహారు వసంతాలకు వెళ్లి, "ఇప్పుడు ఇంకా విశేషమేమిటి అమ్మగారూ" అంది.

"ఏం అప్పుడే ముసలిదాని వయ్యావా? ఇంకా కని పెంచే వయస్సేగా.'

"పిల్లదానికి పెళ్లీడు వచ్చింది. ఈ పిల్లలు చాల్లెండి."

"అదేమిటే అలా అంటావ్? అలా తనకూడదు. పుణ్యంకొద్దీ పురుషుడు, దానంకొద్దీ బిడ్డలు అన్నారు."

"నిజమేలెండి. అయినా మనచేతిలో ఏముంది?" అని అంటూ అది పెరట్లోకి వెళ్లింది.

అమ్మ వంటింట్లోకి వెళ్ళబోతూ నన్ను చూచి, "ఎందుకురా ఇక్కడ నిలబడ్డావ్?" అని అడిగింది.

సమాధానం ఏం చెప్పాలో తోచక, "మంచినీళ్ళు" అన్నాను.

"లోపలికి పోయి తాగు." అని అంది.

నేను వెళ్లబోతుంటే "నేనే పట్టుకు వస్తానులే. నువ్వు మడి బిందెలు ముట్టుకుంటావ్" అని అంది.

నేను మంచినీళ్ళు తాగి సరాసరి రచ్చబండ దగ్గరకు వెళ్ళి కూలబడ్డాను. చింతయ్యగారి చిన్నకోడలు నీలాటి రేవుకు వెళ్ళే తోవ, సమయం కూడా అదే. నేను వెళ్ళి కూర్చున్నానో లేదో భామామణుల సమూహం యమునాతీరానికి బయలు దేరిన గోపవధువుల పగిది గోధూళి సమయంలో అటే వస్తూంది. అంతవరకు ఉషారుగా కబుర్లు చెప్పుకుంటున్న చిన్నారులందరూ నన్ను చూడగానే కొందరు సిగ్గుతో మూగపోతే మరికొందరు చాపాలవంటి కోరచూపులతో నన్ను పలుకరిస్తే నాతో ఏకాంతంగా ఉన్నప్పుడు ప్రేమతో ఉక్కిరిబిక్కిరి చేసే పెద్దయ్యగారి పద్మ నన్ను చూడగానే మూతిముడిచి, పెదవి విరిచి, భ్రుకుటి జోడించి, మూడుసార్లు మెటికలు విరిచి వడివడిగా అంగలు వేస్తూ ముందుకు వెళ్ళింది. ఆ సంకేతానికి అర్థం 'మూడు రోజులై కనిపించటంలేదేం' అని. నేను కూడా కనుసన్నలతోనే ఎన్నో సంగతులు చెబుదామని అనుకున్నాను. ఒకమూల సందెచీకట్లు, మరొకవంక సావాసకత్తెల సమూహం, వీటన్నిటినీ తప్పించి చెరుకువిల్లు చిన్నయ్య నన్ను కవ్విస్తున్నాడని ఆ చేమంతి రేకుల వన్నెచిన్నెదానితో ఎల్లా చెప్పడం? అప్పటికీ నాకు వీలైన పద్ధతిలో "శివదీక్షాపరురాలనురా" అని చక్రవాకరాగం రవంత బిగ్గరగానే విసిరాను. అంటే శివాలయంలో కలుసుకోమని ఆ చిన్నదానికి మాత్రం తెలుసు. ఒక చిరునవ్వు ఇటు విసిరి ముసిముసినవ్వులతో విసవిసా నడచి వెళ్ళిపోయింది.

అందరికీ చిట్టచివర వస్తున్న చింతయ్యగారి చిన్నకోడలు మోయలేని భారం మోస్తున్నదానిలాగా నెమ్మదిగా వస్తూ, పాటవచ్చిన దిక్కున దృష్టి సారించి నన్ను చూడగానే నేను చిరునవ్వు నవ్వాను. ఆ జవరాలు ఒక్కక్షణం ఆగి, కాలిమట్టె సరిచేసుకునే సాకుగా వంగి, నేనున్న దిక్కుకు చూసి, నావంక చిలిపిగా నవ్వి లేచి చెంగున ముందుకు సాగిపోయింది. నేను ఆ పడుచు వెళ్లిన వైపే చూస్తూ విరహంతో ఒక్క వేడి నిట్టూర్పుతో ముందుకు సాగగానే కాలికింద ఏదో మెత్తగా తగిలితే ఉలిక్కిపడి కిందపడ్డ వస్తువు తీసేసరికి సెంటు వాసనలని మరిపించే సన్నజాజి దండ.... సన్నజాజిదండ!

నన్ను వలచి వలపించిన ఆ చిన్నది అలనాడు, తను నాదైన ఆనాడు సన్నజాజినే నాకు నజరానా యిచ్చింది. ఆ చిన్నదాని చిహ్నమే మన యింటి యీ చిన్నదాని తీగె.

"ఇంట వున్న ప్రతి పుష్పం ఒక పూబంతికి చిహ్నమా మావయ్యా!"

"అంతే ననుకో."

"మావయ్యా! నువ్వు దక్షిణ నాయకుడివా?"

"అంతమాట వద్దురా అల్లుడా. ఆ పేరు, ఆ పరువం, ఆ రాధామాధవుడికే. ఆ సత్యభామాప్రియుడికే చెల్లింది."

"నువ్వు మాత్రం తక్కువవాడివా?"

"అష్టనాయికల విషయంలో ఆయనతో రవంత పోటీపడ్డా, పదహారు వేల గోప వధువుల విషయంలో మాత్రం ఆయనకు ఆయనే సాటి."

"ఆ అష్టనాయికలు ఏమయ్యారు? ఎప్పుడేనా కనిపిస్తున్నారా?"

"కనిపించకేం? అంతా యీ వాడ మనుష్యులేగా. కూతురు పెళ్లికనో, మనవరాలి అన్నప్రాసనకనో పిలుస్తారు. కొందరు ఆరిందాలై మరీ పెద్ద ముత్తైదువులై భాష్యం, భగవద్గీత మాట్లాడితే, కొందరు కొంటె కోణంగులు మాత్రం ఒక్కక్షణం పదహారు సంవత్సరాల పడుచులై చిరునవ్వుతో, చిలిపి నవ్వుతో యింకా మాయని మధుర స్మృతులని స్మరించి, నెరిసిన చెంపలని ఒక్కసారి సరిదిద్దుకుంటారు.'

"అంతేనా?"

"భగవద్గీత పారాయణ చేసే వయస్సులో అంతకంటే ఇంకేం ఉంటుంది?'

"కథ దోవ వదలి డొంకన పడ్డదయ్యా?"

"మళ్ళిస్తున్నానుగా." అర్పిన చుట్ట యింకొక సారి వెలిగించుకొని, "ఇంతకూ మనం ఎక్కడున్నాం?"

"రచ్చబండమీద చింతయ్యగారి చిన్నకోడల్ని తలుచుకుంటూ సన్నజాజి ఘుమఘుమలు తలపుకు తెచ్చుకుంటూ."

"మనసైన మగువలందరూ నీలాటి రేవునించి యింటికి వెళుతూ ఇంకొక్క సారి దర్శన మిచ్చారు. కాని మనస్సుకు ఏదో వెలితిగానే వుంది."

"ఏం, చక్కనిచిన్నది చెంతలేదనా?"

"మాటలు నేర్చావే!"

"మేనల్లుడినేగా."

"అన్నింటా అయితే మాబాగే. చిక్కిన మనస్సుతో, వేడి నిట్టూర్పులతో యింటికి వచ్చాను. మనస్సు మనస్సులో లేదు. వెచ్చని వెన్నెలలో మేను వాల్చాను. కన్ను తెరిచినా మూసినా కలత నిద్దరే. రవ్వంత కునుకుపట్టగానే ఒక తియ్యని కల. కలలో కన్నెకతో వెచ్చవెచ్చని ఊసులాడుకుంటూ సంధ్యాసమయంలో యమునా తటిలో నేనూ, సుందరీ విహరించినట్లు నే కలగని సుషుప్తినుంచి జాగృతికి కన్ను

విప్పేసరికి గురుపత్నీ ప్రియుడు, శశాంకుడు మామిడి చెట్టు చాటున నక్కితే, ముసలయ్యగారి కోడి కొక్కొరో భాషలో 'తెల్లవారవచ్చె తెలియక నాస్వామి మళ్లీ పరుండేవు లేరా' అని సుప్రభాతం చెబుతోంది. మనం పానుపు దిగేసరికి ఎదురుగా పెద్ద ముత్తైదువు మా అమ్మ కనబడ్డది. రూపాయంత బొట్టుతో పార్వతీదేవిలాగా ఆవిడ కనబడగానే భక్తి కలిగి నమస్కారం చేశాను. ఆవిడ ఒక్కక్షణం రిచ్చవడి నివ్వెరపోయి, యీ పసికందుకు ఏ గాలో ధూళో సోకిందనుకుని బహుశా మంత్రపు విభూతి కోసం కాబోలు యింట్లోకి వెళ్లిపోయింది. విభూతి నాకు రాస్తే ఏం లాభం? వశీకరణ మంత్రంతో ఒక చిటికెడు ఆ చిన్నదాని మీద చిలకరిస్తే!

సాయంకాలం, పనిచేసేది బొగడపువ్వులు ఏరుతోంది. "బొగడపువ్వులు నీ కిష్టమా" అని అడిగాను.

"నాకెందుకూ? మా పెద్దదానికి. దానికి పువ్వులంటే ప్రాణం."

"అదే వచ్చి ఏరుకుని వెళ్ళవచ్చుగా."

"అది యిక్కడికి ఎలా వస్తుంది?" అనేసరికి, మనసు చివుక్కుమంది.

'నిన్నటి ఉదంతం ఏమన్నా చెప్పిందా' అని రవంత సందేహం కలిగింది. అయినా ధైర్యంగానే "ఏం" అని అడిగాను.

"ఇక్కడికి వస్తే ఎల్లా. శివాలయంలో పువ్వులో?"

"రోజూ వెడుతుందా?"

"పొద్దుగూకులూ అక్కడే వుంటుంది."

సరాసరి శివాలయానికి వెళ్ళాను. శివాలయం దాపున ఒక పెద్ద తోట వుంది. అందులో ఒక బ్రహ్మాండమయిన బొగడచెట్టు. చెట్టు దగ్గర ఒక మండపం. సందె చీకట్లలో ఒక చిన్నది ఒడి నింపిన పువ్వులన్నీ లెక్క చూసుకుంటూంది. నా సవ్వడి వినగానే లేచి, చనువుగా ముందుకు ఒక అడుగు వేసి నా కౌగిలిలో కరిగిపోయింది. నేను ఉలిక్కిపడి "నువ్వా?" అన్నాను. చిన్నది ప్రశ్న వేసేలోపలే "నువ్వేనా" అని దగ్గరకు తీసుకున్నాను.

"ఎవరని అనుకున్నారు?" అని గోముగా ప్రశ్న వచ్చింది.

"నువ్వనే అనుకున్నాను."

"అన్నీ అబద్ధాలు."

"నీతోనా?"

నాకై నడచివచ్చిన యీ అభిసారిక ఎవరో కాదు, పెద్దయ్యగారి పద్మ.

మరునాడు, ఆ మరునాడు యిదే తంతు. చింతయ్యగారి చిన్నకోడలు శివారాధనకు వచ్చి విష్ణుప్రీతిని పొంది వెళ్ళింది. మూడవనాడు నాలుగు గంటలకే గుడికి వెళ్ళాను. ఎవ్వరూ లేరు. ఏం చెయ్యాలో తోచలేదు. పొగడపువ్వులు ఏరి దండ గుచ్చటం మొదలుపెట్టాను. ఇప్పుడు తలచుకుంటే నవ్వు వస్తుంది. పురుషుడేమిటి? పూలమాల కట్టడమేమిటి అని. ఇవన్నీ ఆ కామయ్య చేసే పనులు. దండ సగం పూర్తికాగానే ఎవ్వరిదో అడుగు సవ్వడి విని అటు చూసేసరికి... ఎప్పుడా ఎప్పుడా అని ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న వెన్నెల విసనకర్ర యిటే వస్తోంది. నేను మండపం వెనక్కు దాగాను. సరాసరి చెట్టు దగ్గరకు వెళ్ళి, చూసి ఏమీ అర్థం కానట్టు నిలబడ్డది. చెట్టు కింద రాలిన పువ్వులు లేవు. దేవుడికి నమస్కారం చేసి అక్కడనుంచే వెనక్కితిరిగింది. నేను ముందుకు వచ్చి "సుందాం" అని పిలిచాను.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. రాక్షసుడిలాగా కనబడ్డది నేను. గాలి తగిలిన తీగలాగా నిలువెల్లా వణికిపోయింది తను. కాని చేతిలోని దండ చూడగానే ఆశతో, సంకోచంతో ఒక్కసారి నావంక చూసింది. దండ ముందుకు సాచి

"ఇంద" అన్నాను.

"వద్దు."

"ఫరవాలేదు తీసుకో."

"వద్దు" అంటూ అక్కడనుంచి చకచకా వెళ్ళిపోయింది.

"సుందాం" అని పిలిచాను. సుందరి పలకలేదు. వెనుతిరిగి చూడలేదు.

అడుగు కోపంగా ఇంటివైపు మళ్ళింది. చేతిలో పూదండ సాగే పాదాల్ని ఆపేసింది. గుడిలోకి వెళ్ళి యీ దండ పార్వతీపతి పాదల చెంద వుంచుదామను కున్నాను. మనుష్యులకు నిర్దేశించినవి భగవంతుడికి యివ్వవచ్చునో లేదో. అయినా పాములు, పన్నగాలు ధరించే ఆ విభూతిరాయుడికి మగువలకు మనస్సయ్యే యీ పూదండ దేనికి? మనకేం మనసైనవారు కరువా? కోరినవారికే ఇద్దాం. కాని ఎంత అవమానం? ఇంతవరకూ నేను కోరిన ఏ పడతీ నన్ను కాదని సాగిపోలేదే. నీవూ నాయకుడివా అని ఈసడించి ఏ గంగాకమలాయతాక్షి నన్ను కాదని వేరొక పోరుని చెట్టపట్టలేదే. ఈ దాసీకన్యకా యింత పొగరు? దీని గర్వం అణచవలసినదే. ఈ పూదండ నేను తలలో తురుమవలసిందే. ఈ సుందరి నాది కావలసిందే.

ఇంటికి చేరేసరికి నాన్న సంధ్యావందనం ముగించుకొని ఏదో చదువు కుంటున్నారు. నన్ను చూడగానే "ఎక్కడనుంచి?" అని అడిగారు.

"ఆలయానికి వెళ్ళి వస్తున్నాను." ఈ మాట వినగానే ఆయన ముఖం చూచి తీరవలసిందే. ఏనుగెక్కినంత సంబరం కనిపిస్తోంది. మందహాసంతో "మడికట్టుకో, భోజనం చేద్దాం" అని అన్నారు.

మరునాడు కాదుగదా నాలుగు రోజులదాకా సుందరి రాలేదు. రోజూ బాగా ప్రొద్దుపోయేదాకా కనిపెట్టుకొని ఉండటం, నిరాశతో ఇంటికి వెళ్ళడం. అయిదో రోజున తలంటి పోసుకొని, గాలితో దోబూచులాడే ముంగురులను సరిదిద్దుకుంటూ సరాసరి బొగడచెట్టు దగ్గరకు వచ్చింది. చుట్టూతా కలియజూచింది. ఎవ్వరూ కనబడలేదు. నేను రాలేదనుకొని ధైర్యంగా పువ్వులు ఏరటం మొదలుపెట్టింది. పువ్వులు ఏరటం అట్టే సేపు పట్టలేదు. ఎందుకంటే సగం పైగా పువ్వులన్నీ నేనే ఏరి దండ తయారుచేస్తినయ్యే. ఏదో పాట తనలో తాను అనుకుంటున్నట్లు కూనిరాగం తీస్తోంది. అక్కడనుంచే శివయ్యకు నమస్కారం చేసి ఇంటికి మళ్ళింది. ముందుకు అడుగు సాగలేదు. ఎత్తిన తల వంచింది. ఎందుకని? ఎదురుగా కనబడ్డది నేను. ఒక్కక్షణం ఆగి త్రోవ తప్పుకొని వెళ్ళబోయింది. అక్కడ త్రోవ ఉన్నది ఒక్కరికే. ఆ బాటలో నేను అడ్డంగా నిలబడి ఉంటినయ్యే. నన్ను కాదని ముందుకు పోలేదు. వెనుదిరిగి గుడిలో అడుగుపెట్టలేదు. ఒక్క అడుగు వెనక్కు వేసింది.

"సుందరీ!" అని పిలిచాను.

తలయెత్తి నావంక చూచి తలవంచుకుని నేలమీద బొటనవేలితో రాయడం మొదలుపెట్టింది.

"ఇంటికి వెడుతున్నావా?"

అవునన్నట్లు తలవూపింది.

"నీతో ఒక్కమాట చెప్పనా?"

సుందరి ఏం మాట్లాడలేదు.

"నువ్వు ఎంతో అందమైనదానివి."

".... ....."

"నువ్వంటే నాకు చాలా యిష్టం."

మరోసారి చిన్నది కన్నెత్తి చూసింది. "తోవ వదులు చినబాబూ!" అంది.

"అంత తేలికగా వదులుతానా?" అని అన్నాను.

చిన్నదాని కంట నీరు తిరిగింది. "నీకు దండం పెడతాను."

"నాకు దండం అక్కరలేదు. నేను చెప్పిన పని చెయ్యి. త్రోవ వదులుతాను.'

"అమ్మో! నేనట్టాంటిదాన్ని కాదు."

"కాదు కనుకనే యీ మోజు."

".... ...."

"సుందరీ!"

".... ...."

"నన్ను చూసి ఎందుకు భయపడతావు? నేనేం రాక్షసుడిని కాదే. నిన్నేం తప్పు పని చెయ్యమని అడగటం లేదు. ఇదుగో దండ. నీ కోసమే కట్టాను తీసుకో."

"అక్కర్లేదు."

"రోజూ నువ్వు వస్తావని ఎదురుచూస్తున్నాను. ఈ నాలుగు రోజుల్నుంచీ నువ్వు రాలేదు. నా మనస్సు ఎంత బాధపడ్డదో నీకు ఎలా చెప్పను? నువ్వు రాలేదేం? నామీద కోపం వచ్చిందా?"

"నన్ను వెళ్ళనీ చినబాబూ!"

"దండ తీసుకో. వెళ్ళిపోదువుగానీ."

"నా కక్కరలేదు."

"దీన్ని ఏం చేయను?"

"దేముడి మెళ్ళో వెయ్యండి."

"దేముడి మెళ్ళోనా?" అంటూ ప్రక్కకి తిరిగాను.

సుందరి నన్ను దాటి వెళ్ళిపోతోంది. నేనిలా ఊరుకుంటే లాభం లేదనుకొని ఇంతవరకూ దాచిన అస్త్రాన్ని ప్రయోగించాను. ఆ చిన్నదాన్ని నాలుగు అడుగులు వెయ్యనిచ్చి, "సుందరీ! నువ్వు వెడితే నామీద ఒట్టు" అని అన్నాను.

సాగిన పాదం ఆగింది. నేను రెండడుగులు ముందుకు వేసి, "దండ తీసుకో" అని దండ ఆ పిల్లవైపు జాచాను.

"ఒద్దు" అని అక్కడినుంచే తలవూపింది.

ఇంకొక వ్యక్తినైతే బలవంతంగా పొదివి పట్టుకొని తలలో పూదండ అమర్చేవాడిని. బహుశా సుందరి కూడా నేను అటువంటి పనే ఏదో చేస్తానని అనుకుంటోంది కాబోలు, భయంగా నావంక చూసింది. ఆ మనిషిని చూడగానే చిలిపితనం మాని పెద్దమనిషి తరహాగా ఉందామనిపించింది.

"నీ కోసం ఎంతో ప్రేమతో యీ దండ కట్టాను. ఎంత చెప్పినా నువ్వు వినటం లేదు. నా మాట మన్నించటం లేదు. ఇంత చిన్న కోరిక తీరకపోయిన

తరువాత నేను బ్రతికి ఏం లాభం? నీ ఎదుటనే యీ నదిలో పడి చస్తాను. సుఖంగా ఉండు" అని అంటూ వడివడిగా అంగలు వేసుకుంటూ నది ఒడ్డుకు నడిచాను. "హరోం! హర! హర!" అని ఒక్క పొలికేక పెట్టి నీటిలోకి దూకబోయాను.

"అంత దారుణమా మావయ్యా!"

"నేను గజఈతగాడిని లేరా. ఒక్క ఉదుటున సుందరి వచ్చి నా చెయ్యి పట్టుకుంది."

"ఎందుకు చిన్నబాబూ! నన్ను యిలా సంపుతావు?"

"నన్ను వదులు."

"వదలను. మీరీ పని మానేసి యింటికి వెళ్ళిపోండి. మీరు గొప్పవాళ్ళు. మేం పేదవాళ్ళం. నాతో ఏమిటి మీకు?"

"నువ్వు నా మాట విననప్పుడు, నా ప్రేమ కాదన్నప్పుడు నేను గొప్పవాడిని అయితేమటుకు ఏం లాభం? నన్ను చావనీ. ఈ జన్మలో కాకపోతే వచ్చే జన్మలోనైనా నీ ప్రియుడిగా పుడతాను. శంభో మహాదేవ" అంటూ రంకె పెట్టి నీటివైపుకు వాలబోయాను.

ఈసారి చిన్నది నన్ను గట్టిగా కౌగలించుకొని, "వద్దు చినబాబూ! దండ యియ్యి" అని అంది. ఈ జీవి తరించాడు.

"ఎందుకు చినబాబూ! నన్ను యింకా బాధపెడతావు? నాకు మాత్రం మీమీద మనసు లేదా? పెళ్ళికాకుండా యిట్టాంటి పనులు చేస్తే బొందితోనే ఘోర నరకానికి పోతారని అమ్మ చెప్పింది. వెళ్ళిపొండి. నా ఊసు మరిచిపోండి."

"అన్నీ అబద్ధాలు."

"కాదు. అమ్మ సత్తెమైన మనిషి" అంటూ నన్ను వదిలి బయలుదేర బోయింది.

"ఇదుగో దండ."

"ఇయ్యండి" అని చెయ్యి చాపింది.

"ఊహూ! నేనే తల్లో పెడతాను."

"అమ్మో!" అని అంది.

"ఏం ఫరవాలేదులే."

మాట్లాడకుండా ఒక్కక్షణం రెప్పవాల్చకుండా నావంక చూసింది. మగువల కన్నా ఎక్కువ శ్రద్ధతో మనం చేసుకున్న ముస్తాబు ఊరికే పోలేదు. మెల్లగా నా

దగ్గరకు వచ్చి నిలబడి, వెనక్కి తిరిగింది. పువ్వులు చిన్నదాని సిగలో అమరినాయి. ఇంతవరకూ ఎక్కుపెట్టి ఉంచిన విల్లు ఒక్కసారి సంధించి అనంగుడు విడిచేసరికి ఒక పూలబాణం నాగుండెల్లోంచి దూసుకుని చిన్నదాని హృదిలో నాటుకుంది. నేను మనస్సులోనే ఒక్కసారి "అయం ముహూర్తః సుముహూర్తః" అని అనుకుని రెండు భుజాలు పుచ్చుకుని ఆ మన్మథ మొలకను నావైపుకు తిప్పుకున్నాను. మేము తన్మయులమై ఉన్న క్షణంబున "చంద్రశేఖర! చంద్రశేఖర! పాహిమాం" అంటూ వినబడగానే మేము నివ్వెరపోయి నిలబడి క్షణంలో దూరమయ్యాం. ఎదురుగా నాన్న నిలబడి ఉన్నాడు. శివపూజ కోసం వచ్చిన ఆ పరమశాంత మూర్తి మమ్మల్ని ఈ భంగిమలో చూడగానే ప్రళయకాల రుద్రుడై నిప్పులు కురిపించాడు. ఆయన దగ్గ రే పాలలోచనంగానీ, త్రిశూలంగానీ ఉన్నట్లైతే మమ్మల్ని ఇద్దరినీ హతమార్చేవాడే. అదృష్టవంతులం, అవి లేవు కాబట్టి బ్రతికిపోయాం.

"నా కడుపున చెడబుట్టావురా. ఏమిటో అని అనుకున్నాను. ఇంత అప్రాచ్యుడవని అనుకోలేదు. పవిత్రమైన దేవాలయం దగ్గరా మీ రంకు పురాణాలు? ఛీ! నీ ముఖం నాకు చూపించకు" అంటూ ఆయన గిరుక్కున వెనక్కు తిరిగి స్వామి దర్శనం కూడా చేసుకోకుండా వెళ్ళిపోయాడు.

నాకు నిజంగానే చచ్చిపోదామనిపించింది. సుందరి ముఖాన నెత్తురు చుక్కలేదు. భయంతో వణికిపోతోంది. కన్నీరు మున్నీరవుతోంది.

"ఊరుకో. ఏం ఫరవాలేదు" అని అన్నాను.

"పెద్దయ్యగారు చూశారు. మిమ్మల్నేం చేస్తారో."

"నన్నేమీ చెయ్యరులే. భయపడక యింటికి వెళ్ళు" అని ఆ మనిషిని పంపించాను.

నేను మాత్రం బాగా ప్రొద్దుపోయేదాకా గుళ్ళోనే కూర్చుని, మెల్లిగా యింటి ముఖం పట్టాను. ఇంటిదగ్గర జరగబోయే కాండ తలచుకొని మనస్సుకి చికాకు కలిగింది. నాన్న మీద కోపం కూడా వచ్చింది-

"చిన్నది రవ్వంత దారిలోకి వస్తుంది. కృష్ణా రామా అంటూ ఇంట్లో కూచోకుండా అక్కడే అవతరించాలా. వచ్చాడయ్యా పోనీ చూసినా చూడనట్టు ఊరుకోకూడదు. ప్రణయ సన్నివేశంలో వున్న ప్రేయసీప్రియులకు అండగా పార్వతీదేవి యిచ్చిన శాపం ఈయనకు తెలియదు కాబోలు. రెండు ప్రేమైక జీవులకు ఎడబాటు, భయం కలిగించి ఘోర రౌరవాది నరకాలకు పోయే పాపం మూటకట్టుకున్నాడే. నన్ను కన్నవాడికి ఎంత ఆపద వచ్చింది. అమ్మా పార్వతీ,

జగన్మాతా! యిది తెలియక చేసిన పాపం తల్లీ! కరుణించి కాపాడవమ్మా!' అని ప్రార్థించాను.

ఇంటికి చేరేసరికి దీపపు వెలుగు కనిపిస్తోంది. నన్ను కన్నవాళ్ళ కంఠాలు రవంత బిగ్గరగానే వినిపిస్తున్నాయి. నాన్న ఏదో అనేసరికి అమ్మ,

"అయినా వాడిని ఆడిపోసుకుని ఏం లాభం? ఏ వయస్సులో ఆ వయస్సులో జరగకపోతే ఇంతే."

"ఇంతకూ నాదే తప్పంటావ్?"

"నేనేం అనటం లేదు. దీన్ని గురించి రగడ చేసుకుంటే అల్లరి పడేది మనమే."

"అయితే నోరుమూసుకుని ఆ వెధవ చేసే తప్పుడు పనులన్నీ చూస్తూ ఊరుకోమంటావా?"

"మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యమంటాను."

"ఇహ మనవాడికి పిల్లనెవరిస్తారే?"

"మనమే ఇల్లా యాగీ చేసుకుంటే నిజంగానే ఇవ్వరు. ఉదయమే వెళ్ళి నచ్చిన సంబంధం స్థిరపరుచుకు రండి."

అమ్మకు మనసారా మ్రొక్కి వసారాలోనే కటిక నేలనే నిద్రపోయాను.

మరునాడు ఉదయం నాన్న నన్ను చూసి మాట్లాడలేదు. నన్ను నమిలి మింగేద్దామన్నంత కోపంగా వున్నాడు. అమ్మ ముభావంగా ఉంది. పొద్దున్నే ఊరు వెళ్ళిన నాన్న రెండు రోజుల దాకా తిరిగి రాలేదు. రావటం ఉత్త చేతులతో రాలేదు. ఒక ఘనకార్యం సాధించి వచ్చాడు. ఒక రాక్షస కన్నెను నాకు వధువుగా నిర్ణయించి తాంబూలాలు పుచ్చుకొని మరీ తిరిగివచ్చాడు.

"అత్తయ్య చాలా మంచిది మావయ్యా."

"ఆకారం విషయం అబ్బీ మనం చెప్పేది! మనస్సు మెత్తటిదేలే. నెల తిరగకుండానే నేను చయనులుగారికి దశమగ్రహాన్ని అయ్యాను."

"మామా! మరి సుందరి..."

"లక్షణంగా పెళ్ళి చేసుకుని గంపెడు పిల్లల్ని కన్నది."

"మరి తీరని నీ మక్కువ."

"మాయక మనసున నిలిచింది. ఆ తలపే కదరా మనకు ఎప్పటికీ తీయని కల."

"కృష్ణలీలలు అయ్యాయా" అంటూ అత్తయ్య ఆరుకంఠాలతో పలకరించింది.

ఆ పలకరింపుకు ఆ పరగణాలో ఉన్న పసిపిల్లలంతా త్రాగే పాలు మానేసి గుక్కపెట్టి ఏడవటం మొదలుపెట్టితే వయస్సు మళ్ళినవాళ్ళు ఒక్కక్షణం హడిలి, "అర్జునా! ఫాల్గుణా! కిరీటీ! శ్వేతవాహనా" అని జపం చేసుకుంటూ పడని పిడుగు నుంచి కాపాడుకునే ప్రయత్నంలో ఉండగా నేను చేష్టలు దక్కి శిలనైపోతే, మావయ్య మాత్రం చిరునవ్వు నవ్వి చుట్టు యింకొక్కసారి తాపీగా పీల్చి దూరంగా పారేసి "అంతా అయినట్టే! కాళిందీ మర్దనం ఒక్కటే మిగిలింది" అంటూ ఇంట్లోకి నడిచాడు.